క్లుప్తంగా

తాగునీటి కోసం తండ్లాట



ట్రాక్టర్‌లో డ్రమ్ముల ద్వారా నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

తరిగొప్పుల: వేసవి కాలం ప్రారంభంలోనే మండల ప్రజలకు తాగునీటి కోసం తండ్లాట తప్పడం లేదు. అబ్దుల్‌నాగారం బీసీ, ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఏర్పడింది. మిషన్ భగీరథ తాగునీరు సరఫరా లేకపోవడంతో గృహ అవసరాలకు కాలనీవాసులు వ్యవసాయ బావుల వద్ద నుంచి ట్రాక్టర్లలో డ్రమ్ములతో నీటిని తెచ్చుకుని సమస్య తీర్చుకుంటున్నారు.

ఎల్లమ్మ ఆలయ కమిటీ ఎన్నిక



అమ్మవారికి మొక్కుతున్న అధ్యక్ష, కార్యదర్శులు

జనగామ: జయదుర్గ రేణుక ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అందరూ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శోభనబోయిన శివరాజ్‌యాదవ్‌ను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం



పాలకుర్తి: మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన బెల్లంకొండ సోమయ్య ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కాగా, గురువారం సోమయ్య దశదిన కర్మను పురస్కరించుకొని బాధిత కుటుంబానికి యువకులు, స్నేహితులు, కుల బాంధవులు వాట్సాప్ ద్వారా సేకరించిన రూ. 56,522 నగదుతో పాటు 60కిలోల బియ్యం అందజేశారు. పెంతల అశోక్, బిత్తిని నరేష్, జంపాల రాజు, బత్తిని సోమ్మల్లు, క్లెం నర్సింహులు, బత్తిని పర్శరాములు, బత్తిని మదన్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: ఈనెల 19వ తేదీ లోపు పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును డీపీఓ స్వరూపకు అందజేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నారోజు రామచంద్రం, నాయకులు పగిడిపల్లి మల్లేష్, యాకుబ్, మహేందర్, కృష్ణ, ఉమ్మగొని రాజేష్, రాపోలు రాజ్ కుమార్, ఠాకూర్ వివేక్ సింగ్ పాల్గొన్నారు.

చెట్లను నరికివేయొద్దు

జనగామ: హెచ్‌సీయూ పరిధిలోని భూమిలో చెట్లను నరికివేయడం, వేలం వేయడం నిలిపివేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహనకృష్ణభార్గవ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యునివర్సిటీ భూమిలో చెట్లను నరికివేయడం ఆపి వన్యప్రాణులను రక్షించాలని అన్నారు. చిలువేరు హర్షవర్ధన్, అంబటి బాల్‌రాజు, మాస రాజు, పక్కీరు రమేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

జనగామ రూరల్: ఛత్రపతి శివాజీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ అన్నారు. గురువారం శివాజీ మహారాజ్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో శివాజీ విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మోహన కృష్ణ భార్గవ, లక్ష్మణ్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

జనగామ రూరల్: దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించేలా కృషి చేస్తున్న బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6న జిల్లాలోని అన్ని బూత్‌లలో పార్టీ ఆవిర్భావ వేడుకలు, 14 అంబేడ్కర్ జయంతిని గ్రామాల్లో నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయరామారావు, కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్‌రెడ్డి, ఉడుగుల రమేశ్, బూరుగు సురేష్, తోకలు ఉమారాణి శివరాజ్ యాదవ్, శశిధర్‌రెడ్డి, లక్ష్మీనరసయ్య, శ్రీమాన్, అంజిరెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించరూ..?

- ఇబ్బందుల్లో కేజీబీవీ విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు

చిల్పూరు: అన్ని వసతులతో విద్యార్థినుల కోసం కేజీబీవీలు నిర్మించామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారే తప్ప అవి ఆచరణలోకి మాత్రం రావడంలేదు. మండలంలోని రాజవరం గ్రామ పంచాయతీ పరిధిలో కేజీబీవీ విద్యాలయం ఉన్నా ప్రహరీ లేక పోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యాలయానికి ప్రహరీ, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం కోసం 2023 ఫిబ్రవరి 27వ తేదీన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ. 83లక్షల నిధులు మంజూరు అయ్యాయి. కాగా, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి మంత్రి కేటీఆర్ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టరు ఇసుక, కంకర, సిమెంట్, ఇటుకలు తెప్పించి చేతులు దులుపుకున్నారు. అనంతరం కలెక్టర్‌లు, ఎమ్మెల్యేలు పాఠశాలను సందర్శించినపుడు విద్యార్థినులు ప్రహరీ విషయం లేవనెత్తగా వెంటనే పనులు చేయిస్తామని చెప్పి రెండేళ్లు గడిచినా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఉపాధ్యాయులు, విద్యార్థినులు కోరుతున్నారు.



ప్రహరీ లేని కేజీబీవీ, (ఇన్‌సెట్‌లో) పనుల కోసం వేసిన శిలాఫలకం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రహరీ లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని అధికారులు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.
- ప్రశాంతి, ఎస్‌ఓ

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తిటౌన్: ప్రమాదాలు నివారించేందుకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే

దేవరుప్పుల: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా సత్వర చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మామిడాల యశస్విరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొల్లపల్లిలో ఎస్‌డీఎఫ్ కింద రూ.5 లక్షలతో వాటర్‌ప్లాంట్, రేషన్‌దుకాణంలో సన్నబియ్యం, మండల పరిషత్‌లో పలు గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాద్‌ముబరాక్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని అన్నారు. కాగా, రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుగ్గింపుడి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డీలర్లకు గౌరవ వేతనం పెంచాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, డీటీ లచ్చునాయక్, టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి చౌరస్తాను పరిశీలించిన ఎమ్మెల్యే

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో గత రెండు నెలలగా రాజీవ్ చౌరస్తాలో జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలు, ప్రమాదాలు నివారించేందుకు గురువారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. ఆర్ అండ్ బీ డీఈ అశోక్ కుమార్‌ను పిలిచి ప్రమాదాలు జరగకుండా చౌరస్తాలో నాలుగు వైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చౌరస్తాలో ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై పవన్ కుమార్‌ను ఆదేశించారు. కాగా, అధికారులు వెంటనే పనులు ప్రారంభించారు.

‘యువ వికాసం’ సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రిజ్వాన్‌బాషా



యువ వికాసం పథకం వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

రఘునాథపల్లి: ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ సూచించారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ, తహసీల్దా కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకానికి వచ్చిన దరఖాస్తుల వివరాలను ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని అమలు చేస్తుందన్నారు. తహసీల్దా కార్యాలయాన్ని తనిఖీ చేసి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో వేగం పెంచాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, తహసీల్దార్ మోసిన్ ముజ్తబా తదితరులు ఉన్నారు.

స్వచ్ఛంద సంస్థలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ప్రజాధరణ అనాథ ఆశ్రమాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

జఫర్‌గఢ్: స్వచ్ఛంద సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పొంది ఉండాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. రేగడితండా గ్రామ శివారు టీబీతండా వద్ద ఉన్న ప్రజాదరణ మా ఇల్లు అనాథ ఆశ్రమంతో పాటు అల్వార్‌బండాతండా, లక్ష్మీనాయక్ తండా గ్రామాలను ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. మొదట మా ఇల్లు అనాథ ఆశ్రమానికి సంబంధించిన పలు రికార్డులు పరిశీలించి మౌలిక వసతులపై పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోడల్ గ్రామంగా ఎంపికైన అల్వార్‌బండా తండా గ్రామాన్ని సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి త్వరతగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లక్ష్మీనాయక్ తండాను సందర్శించి నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, గృహ నిర్మణ శాఖ పీడీ మాత్రు నాయక్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఉప్పలయ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, ఎంపీడీఓ సుమన్, ఆశ్రమ నిర్వాహకురాలు గాదె పుష్పరాణి, పూజితతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సన్నబియ్యాన్ని వినియోగించుకోవాలి

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్నబియ్యం పంపిణీ కొనసాగుతోంది. కాగా, గురువారం పలు గ్రామాలు, వార్డుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొని సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్నబియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట: బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



తరిగొప్పుల: బియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దార్ నాగేశ్వర్‌రావు



జనగామ: 17వ వార్డులో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ అనిత

దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిది



జనగామ: దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: సాయుధ పోరాట అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిదని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొమురయ్య జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రం కల్లెం రోడ్డులోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచం చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, 4వేల మంది అమరుల ప్రాణత్యాగ ఫలితంతోనే 20లక్షల మంది రైతులకు భూమి దక్కిందన్నారు. జనగామ పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జూకంటి శ్రీ శైలం, బాల్దె మల్లేశం, బాల్దె సిద్ధిలింగం, పేర్ని స్వరూప, జూకంటి లక్ష్మీ, కర్రె శ్రీనివాస్, దేవునూరి సతీష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంచె రాములు పాల్గొని దొడ్డి కొమురయ్యకు నివాళులర్పించారు.



స్టేషన్‌ఘన్‌పూర్: నివాళులర్పిస్తున్న కురుమసంఘం నాయకులు



రఘునాథపల్లిలో..

ఏయిర్‌పోర్టుకు దొడ్డికొమురయ్య పేరు పెట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట/జఫర్‌గఢ్/ రఘునాథపల్లి/లింగాలఘణపురం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని పలు మండలాల్లో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న మామునూరు ఏయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కురుమ సంఘం నాయకులు డాక్టర్ బుయ్య గట్టయ్య, పేర్ని రవి, కంచె రాములు, ఒగ్గు రాజు, మేకల మల్లేశం, కట్ట బీరయ్య, గుంటి మల్లయ్య, ఎక్కల రాజబీరయ్య, బుల్లె సాయిలు, గొరిగె రవి, మాల్ల యాకయ్య పాల్గొన్నారు.

పోరాట యోధుడు కొమురయ్య

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: అన్యాయానికి వ్యతిరేకంగా, రైతుల హక్కుల కోసం పోరాడిన వీరుడు దొడ్డి కొమురయ్య అని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, దేవరుప్పుల లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కొమురయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, నల్ల శ్రీరామ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరు ఆలయ భూమి సర్వే



ఆలయ భూమిని సర్వే చేస్తున్న ఏడీ మన్నెంకొండ

చిల్పూరు: చిల్పూరు ఆలయానికి సంబంధించి 229/1సర్వే నంబర్‌లోని భూమిని ఏడీ మన్నెంకొండ గురువారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ భూమి అన్యాక్రాంతం అవుతున్నందున దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో హద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణదారులు ఎవరైనా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈఓ లక్ష్మీ ప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు, తహసీల్దార్ సరస్వతి, డీఐ నూకరాజు, అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్ ధర్మకర్తలు ఉన్నారు.

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్ట్

జనగామ రూరల్: హెచ్‌సీయూ భూముల వేలం నిలిపివేయాలనే డిమాండ్‌తో ఏబీవీపీ తలపెట్టిన చలో హైదరాబాద్ నేపథ్యంలో నాయకులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసుల స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ముందస్తు అరెస్టులు చేయడం సరికాదన్నారు. హెచ్‌సీయూ భూములను విక్రయించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సాయి, రాజు,శ్రవణ్, నరేష్ ఉన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

రఘునాథపల్లి: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొదల లవకుమార్ అన్నారు. సెంట్రల్ యూనివర్శిటీ భూములు కాపాడాలని వామ పక్ష విద్యార్థి సంఘాల చలో హైదరాబాద్ పిలుపు నేపథ్యంలో మండలంలోని ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు గొడుగు రమేష్ తదితరులు ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా హెచ్‌సీయూ భూములను వేలం వేయడాన్ని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో గురువారం ఉదయం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు యూనస్, పృథ్వీ మాట్లాడారు. పచ్చని అడవిని రాష్ట్ర ప్రభుత్వం నాశనం చేస్తుందని, హెచ్‌సీయూ భూములను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పజెప్పే కుట్రలు చేస్తుందని ఆరోపించారు.

దేవరుప్పుల: నిరుపేదలకు ఉన్నత విద్యనందించే ప్రభుత్వ విద్యాలయాలను విధ్వంసం చేసే దుశ్చర్యలను ప్రతి ఒక్కరూ నిలువరించాలని ఏబీవీపీ మండల కన్వీనర్ కారుపోతుల నరేశ్ అన్నారు. ఏబీవీపీ తలపెట్టిన చలో హైదరాబాద్ నేపథ్యంలో ముందస్తుగా పలువురిని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

అంగడి వేలం ఖరారు

కొడకండ్ల: మండలకేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే అంగడి వేలం గురువారం ఖరారైంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంగడి వేలం కార్యక్రమానికి డీపీఓ నాగపురి స్వరూప హాజరు కాగా ఆరుగురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. వీరిలో రూ.2.31 లక్షలు పాట పాడిన కడగుట్టతండాకు చెందిన భూక్య యాకూబ్ 2025–26 సంవత్సరానికి గాను తైబజార్ వసూలు కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నాడు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అంగడి వేలం ద్వారా రూ.51 వేలం ఆదాయం గ్రామ పంచాయతీకి పెరిగింది.

భూ సమస్యలు పరిష్కరించండి

బచ్చన్నపేట: రెవెన్యూ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓ గోపీరాం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలు భూ సమస్యలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చేవారి భూ సమస్యలు త్వరగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమి చుట్టూ త్వరలో హద్దులు నిర్ణయించనున్నట్లు చెప్పారు. రెవెన్యూ కార్యాలయంలో సమస్యల పరిష్కారం కోసం మధ్య వర్తులను ఆశ్రయించొద్దన్నారు. తహసీల్దార్ ప్రకాశ్‌రావు, డీటీ ఫణికిషోర్ తదితరులు ఉన్నారు.

ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా రహమాన్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఇన్‌చార్జ్ వైస్ ప్రిన్సిపాల్‌గా, జనగామ పీజీ సెంటర్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రహమాన్ నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

పాలకుర్తి చౌరస్తాలో లారీలు ఢీ

పాలకుర్తి టౌన్: ఎదురెదురుగా వస్తున్న లారీలు ఢీకొన్న ఘటన మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. లారీల్లో ఉన్న డ్రైవర్లకు గాయాలు కాగా వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

లింగాలఘణపురం: ప్రతి విద్యార్థికి చతుర్విద పరిక్రియలు వచ్చే విధంగా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఏఎంఓ శ్రీనివాసు అన్నారు. ఇటీవల ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రమోషన్లు కల్పించిన 120 ఉపాధ్యాయులకు నెల్లుట్ల పాఠశాలలో గురువారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఎంఓ శ్రీనివాసు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థులు చదవడం, రావడంతో పాటు మ్యాథ్స్‌లో చతుర్విద పరిక్రియలు వచ్చే విధంగా బోధించాలని కోరారు.

బీసీ కమిషన్ సభ్యురాలిని కలిసిన అభిగౌడ్

జనగామ రూరల్: జిల్లా ఆర్టీఏ సభ్యుడిగా ఇటీవల నియమితులైన ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభిగౌడ్ గురువారం తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మిని హైదారాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు స్వీటు అందించారు.

ఎండిన పంటలకు ఎకరాకు రూ.50వేలు అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: సాగునీరు అందక ఎండిన పంటలకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. యాసంగిలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్‌డీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నక్క యాకయ్య, లింగనబోయిన కుమారస్వామి, షబానా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా పోచమ్మతల్లి బోనాలు

తరిగొప్పుల: మండలకేంద్రం శివారు కనీలకుంటలో గ్రామదేవత నల్లపోచమ్మకు బోనాలను ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకుని మహిళలు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య బోనాల ఊరేగింపు నిర్వహించారు.

యువతి అదృశ్యం..కేసు నమోదు



శ్రావణి

చిల్పూరు : లింగంపల్లి గ్రామానికి చెందిన ఆకారపు శ్రావణి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. లింగంపల్లికి చెందిన శ్రావణి హనుమకొండలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతోంది. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. తండ్రి వెంకటయ్యకు అర్ధరాత్రి మెలుకువ రాగా కూతురు కనిపించ లేదు. గురువారం సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

పాలకుర్తి: ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ మండల కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. సభకు అధిక సంఖ్యలో ప్రజలను తరలించి సభ విజయవంతం చేయాలని కోరారు. మండల కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, సహకార సంఘం ఉపాధ్యక్షుడు కారుపోతుల వేణు, కడుదుల కరుణాకర్‌రెడ్డి, జంపాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్ పెంచాలి

పాలకుర్తి టౌన్: రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.5వేలు, క్వింటాకు రూ. 300 వెంటనే పెంచాలని తెలగాణ రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా కార్యదర్శి బొగ్గారపు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. నాయకులు బానోత్ చత్రునాయక్, కమ్మగాని రమేష్‌గౌడ్, సుగుణ, రామస్వామి, సోమేశ్వర్, రఘురాం, పార్వతి, పుష్ప, సునీత పాల్గొన్నారు.

నేడు సన్నబియ్యం పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఘన్‌పూర్ మండలంలో చేపట్టనున్నట్లు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఘన్‌పూర్ మండలంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేతో లాంఛనంగా ప్రారంభించనుండగా స్టేషన్‌ఘన్‌పూర్, రాఘవాపూర్, ఛాగల్లు గ్రామాల్లోని రేషన్‌షాపుల్లో ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

రఘునాథపల్లి: కుటుంబ కలహాలతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సోమయ్యకుంటతండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కెతావత్ లింగయ్య (34) తాపీ మేస్త్రీగా పని చేస్తుండేవాడు. మూడు రోజుల క్రితం భార్య కవిత ఉగాది పండుగను పురస్కరించుకుని పుట్టింటికి వెళ్లింది. బుధవారం భార్యను తోలుకవచ్చేందుకు లింగయ్య అత్తారింటికి వెళ్లగా.. భర్త వెంట పంపించేందుకు బామ్మర్దులు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన లింగయ్య అదే రోజు సాయంత్రం గ్రామ సమీపంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నరేష్ తెలిపారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నియామకం

పాలకుర్తి టౌన్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కార్యదర్శిగా గుగులోత్ రాములును నియమిస్తు ఆసంఘం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా చైర్మన్ నందగిరి రజినీకాంత్ గురువారం ఉత్తర్యులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల హక్కుల కోసం కృషి చేస్తాన్నాని తెలిపారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి

పాలకుర్తి: మూఢ నమ్మకాలను ప్రజలు విడనాడాలని ఎస్సై పవన్ కుమార్ అన్నారు. దర్దేపల్లి గ్రామంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేదిక ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, రాములు, డాక్టర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.